

జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607


# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 275 బుధవారం 28 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## సీపీఎస్ఈ ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపుపై మార్గదర్శకాలు

గ్రాట్యుటీ గందరగోళానికి తెర..

రూ. 20 లక్షల పరిమితిపై కేంద్రం కొత్త మార్గదర్శకాలు

రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితిపై నెలకొన్న గందరగోళానికి తెర

2018 మార్చి 29 నుంచి ఈ పరిమితి అన్ని సంస్థలకు తప్పనిసరి

-న్యూఢిల్లీ జనవరి 27,: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, ఏకీకృత మార్గదర్శకాలను జారీ చేసింది. గ్రాట్యుటీ అర్హత, చెల్లింపు కాలపరిమితులు, రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి ఎప్పటి నుంచి వర్తిస్తుందనే మిగతా 2లో...

# పుర పోరుకు మోగిన నగారా

## ఫిబ్రవరి 11న ఒకే విడతలో ఎన్నికలు

116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లు, 2,996 వార్డులు

ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్


ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు

నేటి నుంచి 30 వరకు నామినేషన్ల స్వీకరణ

16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

తక్షణమే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు

: షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని




హైదరాబాద్ జనవరి 27,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షెడ్యూల్ విడుదల చేశారు. అనంతరం ఎన్నికల ప్రక్రియను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల్లో ఒకే విడతలో ఫిబ్రవరి 11న ఎన్నికలు నిర్వహించబోతున్నట్టు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్,మిగతా 2లో...



# మదర్ ఆఫ్ ఆల్ డీల్స్

## ఢిల్లీలో చారిత్రక ఘట్టం..



- భారత్, యూరప్ సమాఖ్య మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు
- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించిన ఈయూ కమిషన్ అధ్యక్షురాలు
- 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత తుది రూపం
- భారత్ నుంచి 97 శాతం ఎగుమతులపై సుంకాల రద్దు
- వచ్చే ఏడాది నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం

-న్యూఢిల్లీ జనవరి 27,(జర్నలిస్ట్ వార్త): భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. ఈరోజు న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు,మిగతా 2లో...



## ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...

షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్

ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొనాలని రాహుల్‌కు ఆహ్వానం

వైఎస్సార్ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి నుంచే ఉద్యమం ప్రారంభం

ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు.మిగతా 2లో...

## ఐదు గంటల పాటు జోగినపల్లి సంతోష్ రావు విచారణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎంపీని ప్రశ్నించిన సిట్

మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రశ్నించిన సిట్

ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్ రావు నియామకం నిర్ణయం ఎవరిదని ప్రశ్నించిన సిట్

హైదరాబాద్ , జనవరి 27,(జర్నలిస్ట్ వార్త); బీఆర్ఎస్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సుదీర్ఘంగా విచారించింది. సిట్ విచారణ కొద్దిసేపటి కిందట ముగిసింది. సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమైన విచారణ ఐదు గంటల పాటు కొనసాగింది. సిట్ అధికారుల్లు,మిగతా 2లో...



## నేటినుంచే మేడారం జాతర

మొదలైన జాతర సందడి

పగిడిద్దరాజు, జంపన్నలను చేర్చే ఘట్టం ప్రారంభం

భారీగా ఏర్పాట్లు చేసిన తెలంగాణ ప్రభుత్వం

ములుగు, జనవరి 27,(జర్నలిస్ట్ వార్త); రెండేళ్లకోమారు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు జాతర సాగనుంది. అమ్మవార్లను గద్దెలకు తీసుకుని రావడం మొదలు..మళల్ఈ అడవికి తరలించే వరకు జాతర సాగుతుంది. ఈ మహా ఘట్టాన్ని సమర్థంగా..,,మిగతా 2లో...



## నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం

సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి



-న్యూఢిల్లీ జనవరి 27,(జర్నలిస్ట్ వార్త):):నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు(2026-27) ప్రారంభం కానున్నాయి. రెండు విడతల్లో ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు మొదటి దశ సమావేశాలు, మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. కాగా తొలిరోజు (బుధవారం) ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసే ప్రసంగంతో బడ్జెట్ సెషన్ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు లోక్‌సభలోనేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. కాగా, పార్లమెంట్ చరిత్రలోనే తొలిసారి ఆదివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు.మిగతా 2లో...



# మదర్ ఆఫ్ ఆల్ డీల్స్

**(మొదటి పేజి తరువాయి)**

యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

# ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...

**(మొదటి పేజి తరువాయి)**

మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు షర్మిల వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆమె వెల్లడించారు.

# బ్యాంక్ ఉద్యోగుల సమ్మెతో స్తంభించిన బ్యాంకు కార్యకలాపాలు

**జనవరి 27,(జర్నలిస్ట్ వార్త);**

వేతనాల పెంపు, పెన్షన్ సంస్కరణలు, 12వ ద్వైపాక్షిక వేతన ఒప్పందం పూర్తిగా అమలు కావాలన్నవి ఉన్నాయి. అంతేకాదు, ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు నిరసన, ఆటోమేషన్, ఔట్‌సోర్సింగ్ వల్ల ఉద్యోగాలపై వస్తున్న ముప్పు, పని ఒత్తిడి తగ్గించాలని, మెరుగైన వర్కింగ్ కండిషన్స్ ఉండాలని, సిబ్బంది కొరత తీర్చాలని, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ లేదా మెరుగైన పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులు కోరుతున్నారు. ఈ డిమాండ్లపై జరిపిన చర్చలు ఫలించకపోవడంతో ఒక రోజు దేశవ్యాప్త సమ్మెకు దిగారు. సమ్మె కారణంగా దేశంలోని దాదాపు అన్ని పబ్లిక్ సెక్టర్ బ్యాంకుల శాఖలు మూసివేశారు. దీంతో బ్యాంకు ఖాతా దార్లకు పరిమిత సేవలు మాత్రమే ఇవాళ అందుబాటులో ఉన్నాయి.

ఫలితంగా దేశ వ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యాపారులు, పెన్షనర్లు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు

# సింగరేణి బొగ్గు స్కామ్‌పై దర్యాప్తు జరిపించండి

## గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన కెటిఆర్ బృందం

హైదరాబాద్, **జనవరి 27,(జర్నలిస్ట్ వార్త్:)**




సింగరేణిలో బొగ్గు స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రసమితి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్ట నేతలు లోక్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్ఆర్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చాం. ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచ్లి,.కాంగ్రెస్‌లో వణుకు మొదలైంది. కుంభకోణాన్ని బట్టబయలు చేశాక పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరిట ఒక్కొక్కరిని పిలుస్తున్నారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావిస్తున్నారు. ఫుట్‌బాల్ ఆటకు రూ.10కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారు. స్కామ్‌ల విషయంలో పాలకుల నుంచి స్పష్టమైన జవాబు లేదు. ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో పారదర్శకతకు పాతరేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి టెండర్లలో నిబంధనలు పెట్టారు. నిబంధన పెట్టిన 9 నెలల్లో ఎందరు కాంట్రాక్టర్లు సందర్శించారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. రింగ్ మాస్టర్ సృజన్‌రెడ్డి.. సీఎం బావమరిదేనా? కాదా? స్పష్టత ఇవ్వాలి. కాంట్రాక్టర్లను రింగ్ చేసి ప్రజాధనం దోపిడీకి యత్నిస్తున్నారు. ప్రభుత్వం రూ.వేల కోట్లు కొల్లగొడుతోందని సింగరేణి కార్మికులు గుర్తించాలి. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గర్నవర్‌ను కోరాం' అని కేటీఆర్ తెలిపారు.

# ఐదు గంటల పాటు జోగినపల్లి సంతోష్ రావు విచారణ

సంతోష్ రావు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్ రావు నియామకం నిర్ణయం ఎవరిదని ప్రశ్నించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి ఆధారాలను ముందుంచి సిట్ ఆయనను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

ప్రభాకర్ రావుకు ఇంటెలిజెన్స్ చీఫ్, ఎస్ఐబీ చీఫ్ బాధ్యతలు అప్పగించడంలో నిర్ణయం, ఆదేశాలు ఎవరు ఇచ్చారనే అంశంపై సంతోష్ రావును సిట్ ప్రశ్నించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఇదివరకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావును విచారించిన విషయం విదితమే.

# జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

## మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన జర్నలిస్టు సంఘాలు



హైదరాబాద్, **జనవరి 27,(జర్నలిస్ట్ వార్త);** రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమం, భద్రత, వృత్తి గౌరవాన్ని కాపాడేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల అక్రిడిటేషన్ అంశంపై అన్ని పాత్రికేయ సంఘాల సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని గతంలో విడుదల చేసిన జీవోలో మార్పులు చేర్పులు చేసి కొత్త జీవోను జారీ చేశామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. మంగళవారం నాడు సచివాలయంలో పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రిగారి కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోకుండా అందరికి న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు.

# పుర పోరుకు మోగిన నగారా

**(మొదటి పేజి తరువాయి)**

13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నామని వివరించారు. నేటి నుంచి 30 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న తుది అభ్యర్థుల జాబితా విడుదల కానుంది. పోలింగ్‌లో ఏవైనా అవాంతరాలు జరిగితే 12న రీ పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 14న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక కోసం సంబంధిత కలెక్టర్ నియమించిన అధికారి ప్రత్యేక సమావేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తారని వివరించారు. ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్నిక నిర్వహిస్తారనీ, ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహిస్తామని చెప్పారు.ఎన్నికలు జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో 8,203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని వివరించారు. ఇందులో 25.62 మంది పురుష ఓటర్లు, 26.80 మంది మహిళా ఓటర్లు, 640 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. బ్యాలెట్ పేపర్ విధానంలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణకు 16,031 బ్యాలెట్ బాక్స్‌లు, 137 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 136 లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పోలింగ్ నిర్వహణకు 742 మంది జోనల్ అధికారులు, 279 ఎఫ్ఎస్‌టీ, 381 ఎస్ఎస్‌టీ టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 1,547 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 9,560 మంది పోలింగ్ ఆఫీసర్స్, 31,428 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు మొత్తం 45,316 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహిం చేందుకు ఓటర్లు, పోటీచేసే అభ్యర్థులు సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్లందరూ పోలింగ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని రాణి కుముదిని పిలుపు నిచ్చారు.

**ఎన్నికలు జరగని మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లు ఇవే..**

కాల పరిమితి ముగియని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించడం లేదని పురపాలక శాఖ శాఖ డైరెక్టర్ టీకే. శ్రీదేవి తెలిపారు. జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు కొత్తూరు, జడ్చర్ల, అచ్చంపేట, సిద్దిపేట, నకిరేకల్ మున్సిపాల్టీలకు ఎన్నికలు జరగడం లేదన్నారు. ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఎన్నికలు జరుగుతున్నవాటితో పాటు రిజర్వేషన్లు ఖరారు చేసినట్టు తెలిపారు. అయితే వాటిలో వార్డులు, డివిజన్ల రిజర్వేషన్లను ఖరారు చేయలేదని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతానికి మించకుండా నిబంధనల ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు శ్రీదేవి తెలిపారు.

**రూ.50 వేల వరకు నగదుకు అనుమతి**

**లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్‌భగవత్**

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున రూ.50 వేల వరకు మాత్రమే నగదు అనుమతి ఉందని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. అంతకంటే ఎక్కువ ఉంటే అందుకు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద ఉంచుకోవాలని కోరారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు 25 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. సెన్సిటివ్, క్రిటికల్, కమ్యూనల్ సెన్సిటీవ్, సాధారణ పోలింగ్ స్టేషన్లును గుర్తించి నాలుగు విభాగాలుగా విభజించామన్నారు.

## ఇదీ షెడ్యూల్

జనవరి 28 నుంచి 30వరకు నామినేషన్లు
జనవరి 31న పరిశీలన
ఫిబ్రవరి 3న ఉపసంహరణ అనంతరం తుది జాబితా..
ఫిబ్రవరి 11న ఒకే విడతలో పోలింగ్
రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న..
ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు
16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక
అనివార్య కారణాలతో ఈ ఎన్నికలు ఎక్కడైనా జరగకుంటే ఫిబ్రవరి 17న నిర్వహిస్తారు

# సీపీఎస్ఈ ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపుపై మార్గదర్శకాలు

**(మొదటి పేజి తరువాయి)**

అంశాలపై నెలకొన్న గందరగోళానికి తెరదించుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ఒక ఆఫీస్ మెమోరాండం విడుదల చేసింది.గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం-1972కు చేసిన సవరణల నేపథ్యంలో 2017, 2018లో జారీ చేసిన పలు సూచనలను, వివరణలను క్రోడీకరించి ఈ తాజా మార్గదర్శకాలను రూపొందించినట్లు డీపీఈ తెలిపింది. సీపీఎస్ఈలలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లు, నాన్-ఎగ్జిక్యూటివ్‌లు సహా అందరు ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది.

**2018 మార్చి 29 నుంచి రూ. 20 లక్షలు తప్పనిసరి**

గ్రాట్యుటీ చెల్లింపు చట్టం-1972కు 2018లో సవరణలు చేసి, గ్రాట్యుటీ గరిష్ఠ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచుతూ కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2018 మార్చి 29 నుంచి అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం 2018 మార్చి 29 లేదా ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన లేదా గ్రాట్యుటీకి అర్హులైన సీపీఎస్ఈ ఉద్యోగులందరికీ రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి వర్తిస్తుంది. ఇది చట్టబద్ధమైన నిబంధన కాబట్టి, సంస్థల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ఈ మొత్తాన్ని తప్పనిసరిగా చెల్లించాలని డీపీఈ తన మెమోరాండంలో స్పష్టం చేసింది.

**గత కాలానికి వర్తించే నిబంధనలు**

అయితే, 2017 జనవరి 1 నుంచి 2018 మార్చి 28 మధ్య కాలానికి సంబంధించిన గ్రాట్యుటీ చెల్లింపులు ఆయా సంస్థల ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ కాలంలో ఐడీఏ పే స్కేల్‌లో వేతన సవరణ పొందిన ఎగ్జిక్యూటివ్‌లు, నాన్-యూనియనైజ్డ్ సూపర్‌వైజర్లకు వారి సంస్థ ఆర్థిక భారాన్ని మోయగలదా? లేదా? అనే అంశాన్ని బట్టి గ్రాట్యుటీ చెల్లింపులు జరపడానికి అనుమతించారు.

**7వ వేతన సంఘం సిఫార్సులు వర్తించవు**

సీపీఎస్ఈ ఉద్యోగులలో తరచూ తలెత్తే ఒక ముఖ్యమైన అనుమానాన్ని కూడా డీపీఈ నివృత్తి చేసింది. 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ పరిమితిని 2016 జనవరి 1 నుంచి రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచారు. అయితే, ఈ పెంపు సీపీఎస్ఈ ఉద్యోగులకు వర్తించదని కేంద్రం తేల్చి చెప్పింది. సీపీఎస్ఈ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని 2016 జనవరి 1 నుంచి క్లెయిమ్ చేసుకోవడానికి వీలులేదని స్పష్టం చేసింది.ఈ ఏకీకృత మార్గదర్శకాలను అన్ని సీపీఎస్ఈలు కచ్చితంగా పాటించేలా చూడాలని, వాటి పరిధిలోని సంస్థలకు ఈ సమాచారాన్ని చేరవేయాలని అన్ని పరిపాలనా మంత్రిత్వ శాఖలను, విభాగాలను డీపీఈ ఆదేశించింది.

# నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**(మొదటి పేజి తరువాయి)**

కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదో సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అయితే ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సాగే అవకాశం ఉంది. మరోవైపు ఎన్నికలు ముగిసిన తరువాత వస్తున్న పూర్తి స్థాయి బడ్జెట్ కావడంతో సామాన్యుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు అందరూ బడ్జెట్‌పై భారీ ఆశలు పెట్టుకున్నారు.

**గవర్నర్ల తీరు, ఉపాధి హామీ, సర్‌వీ, యూజీసీ నిబంధనలపై చర్చకు ప్రతిపక్షాల పట్టు**

ఈ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ల తీరు, ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్), యూజీసీ నూతన మార్గదర్శకాలు, కొత్త విదేశాంగ విధానం, ఇతర అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఉపాధి హామీని దెబ్బతీయడం, కార్మిక కోడ్‌లను విధించడం, లక్షలాది మంది ఓటర్లను మినహాయించిన ఓటర్ల జాబితాను తీవ్రంగా సమీక్షించడం, అమెరికా నిరంకుశ జోక్యాలను ప్రశ్నించని బలహీనమైన విదేశాంగ విధానం, కేంద్రం కొనసాగించిన సమాఖ్య వ్యతిరేక విధానాలు, రాష్ట్రాలపై ఆర్థిక ఒత్తిడి, గవర్నర్ల దుర్వినియోగం, ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రభావం, ఆర్థిక వ్యవస్థపై అమెరికా విధించిన 50శాతం సుంకం వంటి అంశాలపై పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

ఈ సందర్భంగా సర్‌పై వివరణాత్మక చర్చకు కాంగ్రెస్, టీఎంసీ, వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఓటు చోరీ, సర్, రైతుల ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పునరుద్ధరణ, ఇతర అంశాలపై చర్చించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలపై డీఎంకే, టీఎంసీ, వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అలాగే ఉన్నత విద్యా సంస్థల్లో కుల ఆధారిత వివక్షను పరిష్కరించే లక్ష్యంతో యూజీసీలో తెచ్చిన కొత్త నిబంధనలపై కూడా పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ అమరావతి రాజధాని బిల్లు అంశాలన్నీ లేవనెత్తింది. భారత్ ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, 16 ఏండ్లలోపు వారికి సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాలని కూడా పలు పార్టీల ఎంపీలు కేంద్రాన్ని కోరారు. అయితే సమావేశాలకు సంబంధించి ప్రభుత్వ వ్యవహారాల ఎజెండాను ఇవ్వకపోవడంపై సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ఇతర సభ్యులు అభ్యంతరం తెలిపారు.

# నేటినుంచే మేడారం జాతర

**(మొదటి పేజి తరువాయి)**

భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సన్నద్ధమయ్యాయి. ఈసారి సౌకర్యాల కల్పనతోపాటు నిర్మాణ పనులనూ ఏకకాలం చేపట్టారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఒకవైపు వనదేవతల గద్దెల పునర్నిర్మాణ పనులు సాగుతున్న సమయంలోనే లక్షలాది మంది ముందస్తుగా అమ్మలను దర్శించుకున్నారు. ప్రధాన జాతర తేదీల్లో భక్తుల రద్దీ కారణంగా గద్దెల ప్రాంగణం వద్ద అమ్మల దర్శనం ఆషామాషీ విషయం కాదు. ఈసారి గ్దదెల పునర్నిర్మాణం నేపథ్యంలో ప్రాకారం విస్తరించారు. రూ.100 కోట్లతో చేపట్టిన ఈ పనులు ఈసారి జాతరకే వన్నె తీసుకొచ్చాయి. విస్తరణ నేపథ్యంలో ఏకకాలంలో 9-10 వేల మంది దర్శించుకొనే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు. వనదేవతలు సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఒక ఘట్టం మంగళవారం ప్రారంభం కానున్నది. ఊరట్టం పంచాయతీ కన్నెపల్లి గ్రామం నుంచి పోలెబోయిన వంశీయులు మేడారంలోని జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెపై రాత్రి 7 గంటలకు జంపన్నను తీసుకురానున్నారు. జంపన్నను ఆదివాసీల్లోని నాలుగో గొట్టుకు చెందిన పోలెబోయిన వంశీయులు దశాబ్దాలుగా కొలుస్తున్నారు. గతంలో ఇంటివద్దనే పూజలు చేసుకునేవారు. 2022 నుంచి జంపన్నను గద్దెకు తీసుకువస్తున్నారు. గతంలో జంపన్నను తీసుకువచ్చిన పోలెబోయిన సత్యం గతేడాది అనారోగ్యంతో మరణించడంతో ఈసారి అతడి సోదరుడు శ్రీను ఆ బాధ్యతలు తీసుకున్నారు. మేడారం మహాజాతర బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైన పెనుక వంశీయుల ఇలవేల్పు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును మేడారానికి తీసుకెళ్తారు. మహాజాతర పగిడిద్దరాజు చేరికతో ప్రారంభమవుతుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే గ్రామంలో పెనుక వంశీయులు పగిడిద్దరాజు ఆలయాన్ని శుద్ధి చేసి ముగ్గులు వేసి మామిడి తోరణాలతో అలంకరిస్తారు. గ్రామంలోని పెనుక వెంటేశ్వర్లు ఇంట్లో పగిడిద్దరాజుకు ఆదివాసీ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి పాన్పును ఊరేగింపుగా గ్రామంలోని ఆలయానికి తీసుకెళ్తారు. అనంతరం పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి ఊరేగింపుగా మేడారానికి బయల్దేరుతారు. అటవీ మార్గంలో కాలినడకన వెళ్తూ మంగళవారం రాత్రి లక్ష్మీపురంలో బస చేస్తారు. బుధవారం ఉదయం మళ్లీ మొదలై మధ్యాహ్నం వరకు మేడారం చేరుకుంటారు. గ్దదెలపై పగిడిద్దరాజును ప్రతిష్ఠించడంతో మహాజాతర మొదటి ఘట్టం మొదలవుతుంది.



జర్నలిస్ట్ వార్త

బుధవారం 28 జనవరి 2026

# జనసంద్రంగా మారిన అరూరి నివాసం

## బీఆర్ఎస్‌లోకి అరూరి రమేష్ రీ ఎంట్రీతో శ్రేణుల్లో ఉత్సాహం





**వర్ధన్నపేట/ జనవరి 27 (జర్నలిస్టు వార్త):** హనుమకొండలోని ప్రశాంతి నగర్ ప్రాంతం మంగళవారం రాజకీయ కేంద్రంగా మారింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తిరిగి తన సొంత గూడు బీఆర్ఎస్ లో చేరనున్నారనే వార్తతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రాజకీయ ఉత్సాహం వెల్లివిరిసింది. గత రెండు సంవత్సరాలుగా క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉన్నప్పటికీ, ఆయనపై ప్రజల్లో ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గలేదని అరూరి నివాసం వద్ద ఏర్పడిన జనసంద్రం స్పష్టంగా చూపించింది.

బుధవారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో అరూరి రమేష్ గులాబీ కండువా కప్పుకోనున్నారన్న ప్రకటనతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచే అరూరి నివాసం వద్ద పండుగ వాతావరణం కనిపించింది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి తమ అభిమాన నాయకుడిని కలుస్తున్నారు.

అరూరి రమేష్‌ను శాలువాలతో ఘనంగా సత్కరిస్తూ, బీఆర్ఎస్‌లో కీలక పాత్ర పోషించబోతున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్కడి వాతావరణం అంతా 'జై అరూరి జై కేసీఆర్ నినాదాలతో మారుమోగింది. రాజకీయాల్లో ఒడిదుడుకులు సహజమే అయినప్పటికీ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నాయకుడు మళ్లీ రాజకీయ రంగంలోకి దిగడం నియోజకవర్గ అభివృద్ధికి శుభసూచకమని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. అరూరి రమేష్ బీఆర్ఎస్ నాయకత్వంలో మళ్లీ పనిచేయడానికి సిద్ధమవ్వడం వల్ల వర్ధన్నపేట నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు బలమైన అండ లభించినట్లయిందని వారు చెబుతున్నారు. రేపు తెలంగాణ భవన్‌లో జరిగే చేరిక కార్యక్రమానికి భారీ



ఎత్తున తరలివెళ్లేందుకు ఇప్పటికే వాహనాలు సిద్ధం చేశారు. కార్యకర్తల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం, ఆత్మీయ పలకరింపులు అరూరి రమేష్ పట్ల వారికి ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ చేరిక కేవలం రాజకీయ మార్పే కాకుండా, వరంగల్ జిల్లా రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికినట్టుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సీఎం కప్2025 : ధర్మసాగర్ మండల స్థాయిలో క్రీడా ఎంపికలు



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జనవరి 27 (జర్నలిస్టు వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్2025 కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండల స్థాయి క్రీడా ఎంపికలను ఈ నెల 29వ తేదీ గురువారం నాడు ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మండల క్రీడా కమిటీ తెలిపింది. గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి, యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మండల స్థాయి ఎంపికల్లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, కరాటే, ఖో–ఖో, వాలీబాల్, యోగ వంటి విభిన్న క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు తదుపరి దశగా నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా ఎంపిక పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని ధర్మసాగర్ మండల విద్యాశాఖ అధికారి బి. రాంధన్ గారు మరియు ధర్మసాగర్ మండల అభివృద్ధి అధికారి అనిల్ గారు మండల క్రీడా కమిటీ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ పోటీల ద్వారా రాష్ట్ర స్థాయి క్రీడాకారులు ఎదగడానికి అవకాశాలు లభిస్తాయని వారు తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగి, తమ ప్రతిభను నిరూపించుకోవాలనుకునే యువతీ యువకులు తప్పనిసరిగా ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో పాటు 29-01-2026 (గురువారం) ఉదయం 9 గంటలకు ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో హాజరుకావాలని సూచించారు. ఈ మండల స్థాయి క్రీడా ఎంపికలకు సంబంధించిన పూర్తి వివరాలు, మార్గదర్శకాలు మరియు ఇతర సమాచారానికి క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని మండల క్రీడా కమిటీ సభ్యులు తెలిపారు. పి. మైసయ్య 9908630095టి. శైలేందర్ సింగ్ 9949678988

## అభివృద్ధి బాటలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

# రాజకీయ వ్యూహం ఫలించేనా...?

**వర్ధన్నపేట/జనవరి27(జర్నలిస్ట్ వార్త):** పోలీస్ బాధ్యతల నుంచి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టిన కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట నియోజకవర్గంలో రాజకీయాన్ని సరికొత్త కోణంలో ఆవిష్కరిస్తున్నారు. ఖాకీ డ్రెస్ వదిలి ఖద్దర్ ధరించినప్పటికీ, ఆయన పనితీరులో మాత్రం ఇంకా ఆ క్రమశిక్షణ, వ్యూహాత్మకత స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజ్యాంగమే ఆయుధం అభివృద్ధే లక్ష్యం అనే నినాదంతో ముందుకు సాగుతున్న ఆయన, కేవలం అధికారాన్ని అనుభవించడం కంటే క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఉన్న రాజకీయ సమీకరణాలను పక్కన పెట్టి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక ఓటు బ్యాంకును సృష్టించుకునే పనిలో ఉన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ, వర్ధన్నపేటకు అదనపు నిధులను మళ్లించడంలో ఆయన సఫలీకృతులవుతున్నారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల



నగారా మోగిన తరుణంలో, ఎమ్మెల్యే నాగరాజు తన రాజకీయ చతురతకు పదును పెడుతున్నారు. వర్ధన్నపేట మున్సిపల్ కేంద్రలో మొత్తం 12 కౌన్సిలర్ స్థానాలకు గాను కనీసం 9 స్థానాలను కైవసం చేసుకుని, మున్సిపల్ చైర్మన్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఆయన పావులు కదుపుతున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ, సరైన ద్వితీయ శ్రేణి నాయకత్వం లేకపోవడం, పాత–కొత్త నాయకుల మధ్య సమన్వయ లోపం ఎమ్మెల్యేకు కొంత సవాలుగా మారింది. మరోవైపు, గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఇంకా పట్టు కోల్పోకుండా ఉండటం, క్షేత్రస్థాయిలో గులాబీ పార్టీకి బలం ఉండటం ఈ ఎన్నికలను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. విపక్షాల ఎత్తుగడలను తిప్పికొడుతూ, ప్రజల్లోకి చొచ్చుకుపోవడానికి అభివృద్ధి ఒక్కటే మార్గమని నమ్ముతున్న నాగరాజు, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడం ద్వారా ప్రత్యర్థులకు గట్టి సమాధానం చెప్పాలని చూస్తున్నారు. తన నియోజకవర్గంలో రాజకీయ విభేదాల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఇస్తూ, అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్న తీరు స్థానికంగా చర్చనీయాంశమవుతోంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాలే కేఆర్ నాగరాజు భవిష్యత్తు రాజకీయ దిశను నిర్ణయించనున్న తరుణంలో, ఆయన వేస్తున్న ప్రతి అడుగు వర్ధన్నపేట రాజకీయాల్లో ఒక సంచలనంగా మారుతోంది. అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ద్వారా ప్రజల మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్న ఈ మాజీ ఐపీఎస్ అధికారి, రాజకీయాల్లో తన మార్కును ఎంతవరకు నిలబెట్టుకుంటారో కాలమే నిర్ణయించాలి మరి.

# కూడా మాజీ చైర్మన్ గట్టు ప్రసాద్‌బాబు మృతికి సంతాపం





**స్టేషన్‌ఘన్‌పూర్/జనవరి 27 (జర్నలిస్ట్ వార్త)** స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కూడా చైర్మన్ కీ.శే. గట్టు ప్రసాద్‌బాబు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ గట్టు ప్రసాద్‌బాబు నిబద్ధత గల నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రాజకీయ ఎదుగుదలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన ఎనలేని సేవలను గుర్తు చేసుకుంటూ మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లూరి అశోక్, రజనీకాంత్, ముంజ వెంకటరాజం గౌడ్, కరిమిల్ల సంపత్‌రావు, భూషబోయిన సంపత్ యాదవ్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలోజు శంకరాచారికి 'గద్దర్ స్మారక కళా పురస్కారం' ప్రదానం

**హనుమకొండ/జనవరి 27(జర్నలిస్ట్ వార్త);** రంగస్థల పద్య నాటక రంగంలో విశేష కృషి చేస్తున్న వల్లభాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు పోలోజు శంకరాచారి అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక మరియు తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఆయనకు 'గద్దర్ స్మారక కళా పురస్కారాన్ని' ప్రదానం చేశారు. హనుమకొండ జిల్లా ఎలుకతుర్తి మండలానికి చెందిన శంకరాచారి, పద్య నాటక కళను బ్రతికిస్తూ సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి నిర్వాహకులు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ప్రముఖ హాస్యనటుడు ఆర్.ఎస్. నంద చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు నిర్వాహకులు పోలోజు రాజ్‌కుమార్, ఆచార్య డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు. శంకరాచారికి ఈ పురస్కారం లభించడం పట్ల జిల్లాలోని బీసీ సంఘాలు, విశ్వకర్మ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది జిల్లా కళాకారులందరికీ గర్వకారణమని




# రాయసముద్రం చెరువును పరిశీలించిన రంగనాథ్

### ఎఫ్‌టిఎల్ పరిధిలో పేదల ఇళ్ల జోలికి వెళ్లమని హామీ

### వరదముంపు నుంచి చెరువులను కాపాడడమే లక్ష్యమని వెల్లడి

సంగారెడ్డి **జనవరి 27,(జర్నలిస్ట్ వార్త);** :జిల్లాలోని ఆర్సీపురంలోని రాయసముద్రం చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా సందర్శించి, అక్కడ జరుగుతున్న పరిణామాలను పరిశీలించారు. రాయసముద్రం చెరువు పరిశీలనలో భాగంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో హైడ్రా గురించి జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఎఫ్.టి.ఎల్ పరిధిలో ఇప్పటికే నిర్మించబడి, ప్రజలు నివాసం ఉంటున్న ఇళ్ల జోలికి హైడ్రా వెళ్లదని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. హైడ్రా రంగంలోకి దిగగానే ఇళ్లను నేలమట్టం చేస్తుందనే భయాన్ని ప్రజల మనసుల్లో నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. నిబంధనల ప్రకారం చెరువుల రక్షణ ముఖ్యం అయినప్పటికీ, సామాన్యులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం తమకు లేదని ఆయన స్పష్టం చేశారు. చెరువుల విషయంలో హైడ్రా ప్రధాన లక్ష్యం వరద ముప్పును నివారించడం. ఇందులో భాగంగా చెరువు అలుగు ప్రవాహానికి



అడ్డంగా ఉన్న నిర్మాణాల పట్ల కఠినంగా ఉండక తప్పదని ఆయన వివరించారు. ఒకవేళ అలుగు ప్రవాహానికి అడ్డంగా ఉండి, నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలిగిస్తుంటే.. అలాంటి ఇళ్లను తొలగించడం తప్పనిసరి అవుతుందని చెప్పారు. అయితే, ఇలాంటి సందర్భాల్లో ఇళ్లను కోల్పోయే వారికి ప్రభుత్వం తరపున తగిన నష్టపరిహారం చెల్లిస్తామని ఆయన ప్రకటించారు. ఒకటి రెండు ఇళ్ల కోసం మొండిగా వ్యవహరిస్తే, భవిష్యత్తులో వరదలు వచ్చినప్పుడు లక్షలాది మంది ప్రజలు నీట మునిగి ఇబ్బంది పడాల్సి వస్తుందని, అలాంటి విపత్తును ఆపడమే హైడ్రా ప్రాధాన్యత అని వివరించారు. హైడ్రా తీసుకునే ప్రతి చర్య వెనుక ప్రజా ప్రయోజనం దాగి ఉంటుందని రంగనాథ్ తన పర్యటనలో నొక్కి చెప్పారు. లక్షలాది మంది ఇబ్బంది పడకుండా ఉండాలంటే కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, కానీ అవి ఎప్పుడూ చట్టబద్ధంగా , మానవతా దృక్పథంతోనే ఉంటాయని భరోసా ఇచ్చారు. చెరువుల పునరుద్ధరణ , నాలాల ఆక్రమణల తొలగింపు ద్వారా నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడటమే తమ అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
RNI NO: TELTEL/2023/87607



# చికిత్స పొందుతూ యువకుడు మృతి

### పెళ్లిచూపులు రద్దు కావడంతో మనస్తాపం - పురుగుల మందు సేవించి ఆత్మహత్య

**రాయపర్తి /జనవరి 27 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని దుబ్బ తండా గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటనలో ఓ యువకుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బ తండా గ్రామానికి చెందిన బట్టు మురళి (22) అనే యువకుడికి ఇటీవల పెళ్లిచూపులు జరిగాయి. అయితే అనుకోని కారణాలతో ఆ పెళ్లిచూపులు రద్దు కావడంతో, తనకు పెళ్లి కాదన్న అపోహతో మురళి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.ఈ నెల 13న గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద మద్యం సేవించిన మురళి, అదే మైకంలో పురుగుల మందు తాగాడు.



అనంతరం తన మిత్రుడు సిద్ధుకు ఫోన్ చేసి వెంటనే రావాలని కోరాడు. సిద్ధు అక్కడికి చేరుకునే సరికి మురళి అపస్మారక స్థితిలో కెనాల్ పక్కన పడి ఉన్నాడు.వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం తొర్రూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మురళి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుని తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపిందిద

## ఓట్లుసీట్లుఅధికారం తప్ప పట్టణ సమస్యలపై

# పాలక పార్టీలకు చిత్తశుద్ధి లేదు

### ఎన్నికల హామీలను విస్మరించిన పార్టీలను మట్టి కరిపించాలి

**ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ**




**నర్సంపేట/జనవరి 27 (జర్నలిస్ట్ వార్త):** ఓట్లు, సీట్లు, అధికారం సాధించడమే లక్ష్యంగా ప్రజలను మభ్యపెట్టడం తప్ప పట్టణ సమస్యల పరిష్కారంపై పాలక పార్టీలకు కనీస చిత్తశుద్ధి కూడా లేదని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిన పాలక పార్టీలను రానున్న ఎన్నికల్లో ప్రజలు మట్టి కరిపించాలని ఆమె పిలుపునిచ్చారు.ఎంసిపిఐ(యు) పార్టీ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ కేశెట్టి సదానందం అధ్యక్షతన నర్సంపేట పట్టణంలోని ఓంకార్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో వంగల రాగసుధతో పాటు పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జనాభా పరంగా నర్సంపేట పట్టణం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అభివృద్ధి మాత్రం అందుకు తగిన స్థాయిలో జరగడం లేదని అన్నారు. దీనికి ప్రధాన కారణం పాలకుల నిర్లక్ష్య వైఖరే అని విమర్శించారు. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు, వాస్తవంగా పట్టణ అవసరాలకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.అభివృద్ధి కంటే వ్యక్తిగత సంపాదనే ధ్యేయంగా స్వార్థపూరితంగా పాలకులు వ్యవహరిస్తున్నారని, దీని వల్ల ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు చిత్తశుద్ధితో ఆలోచించి, అభివృద్ధికి బాటలు వేసే విధంగా నీతిగా, నిజాయితీగా, పట్టుదలతో పనిచేసే అభ్యర్థులను మాత్రమే ఆదరించాలని కోరారు.డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలతో ఓట్లను కొనుగోలు చేసి గెలిచి ప్రజలను దోచుకునే అభ్యర్థులను ప్రజలు తిరస్కరించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేసే ఎంసిపిఐ(యు) అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఏఐసిటియు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ మాషుక్, పార్టీ పట్టణ నాయకులు మోటం సురేష్, అనుమల రమేష్, బండారి మల్లేష్, సాంబన్న, రవి, రథం తదితరులు పాల్గొన్నారు.

# నారపనేనిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్, సాక్సులు పంపిణీ

### స్వచ్ఛంద సంస్థ చైర్మన్ షేక్ లతీఫ్ సేవా భావానికి ప్రశంసలు



**వైరా /జనవరి 28 (జర్నలిస్ట్ వార్త):** వైరా మండల పరిధిలోని నారపనేనిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు షూస్, సాక్సులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సామాజిక సేవా కార్యకర్త, స్వచ్ఛంద సంస్థ చైర్మన్ షేక్ లతీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా షేక్ లతీఫ్ మాట్లాడుతూ, గతంలో జూలై 2025 నెలలో ఈ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు జనవరి 2026లో విద్యార్థులందరికీ షూస్, సాక్సులు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులు మంచి విద్యాభ్యాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన షేక్ లతీఫ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వరంగల్‌లో రాష్ట్ర స్థాయి ఘన పర్యావరణ కార్యశాల

# భవిష్యత్ తరాల రక్షణకు పిలుపు

**ధర్మసాగర్ /జనవరి 27 (హనుమకొండ బ్యూరో, జర్నలిస్ట్ వార్త):** జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం, యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్" అంశంపై రాష్ట్ర స్థాయి కార్యశాల మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యశాల పర్యావరణ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని, వరంగల్ పశ్చిమలోని తెలంగాణ సోషల్ వెల్‌ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగింది.కార్యక్రమానికి కాజీపేట పురుషోత్తం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మ ప్రకాష్ రచించిన "చిత్తడి నేలలు" మరియు "ఆరావళి పర్వతాల సంరక్షణ" అంశాలపై కరపత్రాలు, అలాగే స్పార్క్ సైన్స్ లఘు పుస్తకాన్ని ప్రముఖ శాస్త్రవేత్త ఆచార్య పాండురంగారావు ఆవిష్కరించారు.కార్యశాలలో మూడు ప్రధాన పర్యావరణ ఉపన్యాసాలు నిర్వహించబడ్డాయి. ఆచార్య పాండురంగారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల విస్తరణ కారణంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పడుతున్న తీవ్రమైన ప్రమాదాలను వివరించారు. పర్యావరణ విధ్వంసాన్ని అడ్డుకునేందుకు పర్యావరణ నిపుణులు, విద్యార్థులు, ప్రజలు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రముఖ పర్యావరణవేత్త ఆచార్య సుదర్శన్ రెడ్డి సమాజంలో పర్యావరణ విద్య అత్యవసరమని, భవిష్యత్ తరాల రక్షణ







కోసం ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని వివరించారు.డాక్టర్ బి. రామరాజు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (చీ౫) వరంగల్ బయోటెక్నాలజీ విభాగం, శిలాజ ఇంధనాల వినియోగం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే దుష్పరిణామాలను వివరించారు. స్వచ్ఛమైన ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఆయన హైలైట్ చేశారు.జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్రాంత ఆచార్యులు కే. లక్ష్మారెడ్డి పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ దృక్పథంతో సమాజ నిర్మాణానికి చేపడుతున్న విస్తృత కార్యక్రమాలను వివరించారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్షపతి, కోశాధికారి పరికిపండ్ల వేణు, ఉపాధ్యక్షులు డాక్టర్ రాములు, వకుళాభరణం శ్రీనివాస్, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, కార్యదర్శి పాల కుమారస్వామి, డాక్టర్ వెంకటస్వామి, కృష్ణారావు, రాధ, పద్మతో పాటు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పర్యావరణ నిపుణులు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.అలాగే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యశాల విజయవంతానికి తోడ్పడ్డారు.నిర్వాహకులు పేర్కొన్నారు, ఈ కార్యశాల ద్వారా పర్యావరణ పరిరక్షణ, విద్యా అవగాహన పెంపొందించడం, భవిష్యత్ తరాలకు పర్యావరణ పరిరక్షణలో బాధ్యతల అవగాహన ఏర్పరచడం లక్ష్యంగా పెట్టుకున్నామని. పేర్కొన్నారు.

# అక్రిడేషన్ జీవో మార్పుతో డెస్క్ జర్నలిస్టులకు న్యాయం

### ప్రెస్ క్లబ్‌లో సంబురాలు

**హనుమకొండ / జనవరి 27 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం డెస్క్ జర్నలిస్టులకు కూడా మీడియా కార్డు స్థానంలో అక్రిడిటేషన్ కార్డు జారీ చేస్తామని జీవో నెంబర్ 252లో మార్పులు చేయడం జర్నలిస్టు సంఘాల సమిష్టి పోరాటానికి దక్కిన ఘన విజయమని పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు.

పాత అక్రిడిటేషన్ జీవోలో మార్పులు చేసి డెస్క్ జర్నలిస్టులకు సమాన హక్కులు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో డెస్క్ జర్నలిస్టులు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే (143) జిల్లా యూనియన్ల ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మీడియా రంగంలో డెస్క్ జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని, వార్తల తయారీ నుంచి ప్రచురణ వరకు వారి సేవలు




అనివార్యమని తెలిపారు. ఇప్పటివరకు డెస్క్ జర్నలిస్టులకు తగిన గుర్తింపు, హక్కులు దక్కకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అక్రిడిటేషన్ జీవోలో మార్పులు చేసి డెస్క్ జర్నలిస్టులకు న్యాయం చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమని, హక్కుల సాధన కోసం యూనియన్లు నిరంతరం పోరాడతాయని నాయకులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం మరిన్ని సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు.


ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, బీఆర్ లెనిన్, రాష్ట్ర హౌసింగ్ & వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకట రమణ, డెస్క్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ శంకర్ రావు శెంకేషి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, జిల్లా అధ్యక్షులు మస్కపురి సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్ పాల్గొన్నారు.అలాగే గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, డెస్క్ జర్నలిస్టుల నాయకులు సిహెచ్ సోమనర్సయ్య, ఎం. రాజేంద్ర ప్రసాద్, అల్లం రాజేశ్ వర్మ, వి. శ్రీనివాస్, లింగయ్య, ఎం. సుధాకర్, శ్రీహరి రాజు, బొడిగె శ్రీను, విద్యాసాగర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్నారుగూడెం

# అభివృద్ధి బాట

### మాజీ సర్పంచ్ కన్మత రెడ్డి నరసింహారెడ్డి నుంచి మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత వరకు అభివృద్ధి కొనసాగింపు

**తల్లాడ / జనవరి 26 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదంటే దానికి ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీనేనని గ్రామ ప్రజలు గట్టిగా చెబుతున్నారు. గ్రామంలో ఏ కార్యకర్తను అడిగినా, ఏ వృద్ధుడిని ప్రశ్నించినా కాంగ్రెస్ అంటే అభివృద్ధి అనే సమాధానమే వినిపిస్తోంది. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కాంగ్రెస్ పార్టీ ముందుండి పనిచేసిందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.మాజీ సర్పంచ్ కన్మత రెడ్డి నరసింహారెడ్డి హయాంలో గ్రామ అభివృద్ధికి బలమైన పునాదులు పడ్డాయి. సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో పశు వైద్యశాల నిర్మాణం చేపట్టడం ద్వారా పశుపోషక రైతులకు ఎంతో మేలు చేకూరింది. అలాగే గ్రామ విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని, కోటికి పైగా విలువ చేసే నాలుగు ఎకరాల భూమిని హైస్కూల్ కోసం కేటాయించి అన్నారుగూడెంలో హైస్కూల్ ఏర్పాటు చేయడం ఆయన దూరదృష్టికి నిదర్శనంగా ప్రజలు



కొనియాడుతున్నారు.అదేవిధంగా, ఎస్సీ వర్గాలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయడంలో కీలక పాత్ర పోషించి, పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఆ రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ అంటే పేదల పార్టీ, అభివృద్ధి చేసే పార్టీ" అనే నమ్మకం గ్రామ ప్రజలలో బలంగా ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు.ఇటీవల పదవీ విరమణ చేసిన మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత కూడా అభివృద్ధి పరంపరను కొనసాగించారు. రైతుల అవసరాలను గుర్తించి రైతు వేదిక కోసం తీవ్రంగా పోరాడి, సుమారు 25 లక్షల రూపాయల విలువైన తమ సొంత సాగుభూమిని రైతు వేదిక నిర్మాణానికి కేటాయించడం ద్వారా ప్రజాభిమానాన్ని చూరగొన్నారు.

అంతేకాకుండా, గ్రామంలో చిన్నచిన్న బజార్లకు సీసీ రోడ్ల నిర్మాణం, నర్సరీల ఏర్పాటు, వైకుంఠధామం అభివృద్ధి, గ్రామపంచాయతీ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దడం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని గ్రామస్థులు గుర్తు చేసుకుంటున్నారు.

మొత్తంగా చెప్పాలంటే, అన్నారుగూడెం గ్రామంలో గతం నుంచి నేటి వరకు జరిగిన అభివృద్ధి పనులన్నీ కాంగ్రెస్ పార్టీ పాలనలోనే సాధ్యమయ్యాయని, భవిష్యత్తులోనూ గ్రామాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మెజార్టీ గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు.

# డాక్టర్ రత్న మనోహర్, పెద్ద పుల్లయ్యలకు ఘన సన్మానం






**తల్లాడ / జనవరి 28 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందించి బదిలీపై వెళ్లిన డాక్టర్ ఐ. రత్న మనోహర్‌కు, అలాగే హెల్త్ సూపర్వైజర్‌గా పనిచేసి పెద్దగోపతి ఆరోగ్య కేంద్రానికి హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్‌గా ప్రమోషన్ పొందిన కొత్త పెద్ద పుల్లయ్యకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సన్మాన కార్యక్రమం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ కె. ప్రత్యూష అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ప్రదీప్ హాజరై, సన్మానితులను అభినందించారు.ఈ సందర్భంగా తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రత్న మనోహర్, పెద్ద పుల్లయ్యలు అందించిన సేవలను పలువురు వైద్యులు, సిబ్బంది కొనియాడారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో వారు చూపిన అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు మౌనిక, నవ్య కాంత్, అల్తాఫ్, రాధాకృష్ణ, బాలకృష్ణ, నీలిమతో పాటు భాస్కర్, శివరాజు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, అనంత రాములు పాల్గొన్నారు. అలాగే తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దవాఖాన వైద్యులు, సూపర్వైజర్లు ఝాన్సీ లక్ష్మి, భద్రమ్మ, సిబ్బంది రామలక్ష్మి, కళావతి, జ్యోతి, విజయలక్ష్మి, కృష్ణ, సురేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు హాజరై సన్మానితులను ఘనంగా అభినందించారు.

## తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గండికోట వెంకన్న నియామకం



**కాజీపేట/జనవరి 26(జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా కాజీపేట మండలానికి చెందిన గండికోట వెంకన్నను తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అల్లుమల్లు వెంకన్నకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గండికోట వెంకన్న మాట్లాడుతూ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వడ్డెర కులాభివృద్ధి, సేవా కార్యక్రమాల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన గౌరవ అధ్యక్షులు పిట్ల మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి పి. వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు కంది రాజు, శివరాత్రి శంకర్ (మండల అధ్యక్షులు), శివరాత్రి కుమార్ (గ్రామ శాఖ అధ్యక్షులు)తో పాటు ఇతర ఒడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు.

# కాకతీయ మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత




**ధర్మసాగర్/ జనవరి హనుమకొండ బ్యూరో 26(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన రేమిడి మహేందర్ రెడ్డి రెడ్డి (59) మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుతూ మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అవయవ దానం, మృతదేహ దానం ద్వారా అనేక మంది వైద్య విద్యార్థులకు ఉపయోగపడుతుందని, సమాజానికి ఇది గొప్ప సేవగా నిలుస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. రేమిడి మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి ప్రేరణగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని మృతునికి నివాళులు అర్పించారు. అనంతరం మృతదేహాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనానికి వినియోగించేందుకు అధికారికంగా మెడికల్ కాలేజీకి అప్పగించారు. మానవ సేవే మహత్తర సేవ అన్న భావనను చాటిన ఈ ఘటన సమాజంలో విస్తృత స్పందనను రేకెత్తించింది.




# తల్లి జ్ఞాపకార్థంగా కాలనీ ఆర్చ్ నిర్మాణం

## ఇల్లందలో వినాయక నగర్ ఆర్చ్ ఘన ప్రారంభోత్సవం

**వర్ధన్నపేట జనవరి27(జర్నలిస్ట్ వార్త):**
తల్లిదండ్రుల విలువలు తగ్గిపోతున్న ఈ కాలంలో, తన తల్లి జ్ఞాపకార్థంగా శాశ్వత గుర్తుగా కాలనీ ఆర్చ్‌ను నిర్మించి ఒక కొడుకు చూపిన కృతజ్ఞత భావం ఇల్లంద గ్రామంలో ప్రశంసల వర్షం కురిపిస్తోంది.

ఇల్లంద గ్రామానికి చెందిన సమ్మెట వీరలక్ష్మి సమ్మయ్య దంపతుల కుమారుడు సమ్మెట మహేష్ గౌడ్ చిన్నతనంలోనే తన తల్లి వీరలక్ష్మిని కోల్పోయాడు. తల్లి మరణించినా ఆమె జ్ఞాపకం, ఆశీస్సులు ఎప్పటికీ తన జీవితానికి మార్గదర్శకంగా ఉండాలన్న భావనతో ఆమె స్మరణార్థంగా ఏదో ఒక శాశ్వత గుర్తింపు ఉండాలనే సంకల్పంతో కాలనీ ఆర్చ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఇల్లంద గ్రామంలోని 11, 12 వార్డులను కలిపే కాలనీకి వినాయక నగర్ గా నామకరణం చేస్తూ, సుమారు 3 నుంచి 4 లక్షల రూపాయల వ్యయంతో ఆధునిక హంగులతో, ఆకర్షణీయంగా కాలనీ ఆర్చ్‌ను నిర్మించారు. ఈ ఆర్చ్ కాలనీకి ప్రత్యేక గుర్తింపుగా నిలవడమే కాకుండా గ్రామాభివృద్ధికి కూడా దోహదపడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.



ఈ ఆర్చ్ ప్రారంభోత్సవం ఆదివారం గ్రామ పెద్దలు, ప్రముఖులు, అజాద్ హింద్ ఫౌజ్ యూత్, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై వేడుకను విజయవంతం చేశారు. ప్రారంభోత్సవ అనంతరం అతిథులకు స్వీట్స్ పంపిణీ చేశారు .తల్లిదండ్రులను భారంగా భావించే ఈ రోజుల్లో, తన తల్లి జ్ఞాపకార్థంగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కాలనీ ఆర్చ్ నిర్మించడం ద్వారా సమ్మెట మహేష్ గౌడ్ యువతకు ఆదర్శంగా నిలిచారని గ్రామ పెద్దలు కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవీయ విలువలను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం యువతలో తల్లిదండ్రుల పట్ల గౌరవం, కృతజ్ఞత భావాన్ని పెంచేలా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఆన్లైన్ బెట్టింగ్‌తో యువకుడి ఆత్మహత్య

## బాధిత కుటుంబానికి జేపీసీ నాయకుల పరామర్శ



**భీమదేవరపల్లి/జనవరి27 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన సుంచు రామ్ చరణ్ (23) ఆన్లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఇటీవల మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ విషయం తెలుసుకున్న జేఏసీ, డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర నాయకులు మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బాధతో రోదిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ దేగల సారయ్య మాట్లాడుతూ, భవిష్యత్తు ఉన్న యువకుడు ఆన్లైన్ బెట్టింగ్ కారణంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. యువత ఆన్లైన్ బెట్టింగ్ ఆటలకు దూరంగా ఉండాలని, డబ్బులు పోగొట్టుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అలాగే డ్రగ్స్ సేవించడం వల్ల కూడా యువత తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంచి సమాజ నిర్మాణానికి యువత ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆన్లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న సైబర్ నేరస్తులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కోడలు, కొడుకు అనారోగ్యంతో మృతి చెందగా, తాజాగా ఆన్లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న మనవడిని కోల్పోయిన మధురమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర నాయకులు గాండ్ల పద్మ, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, మాట్ల వెంకటస్వామి, వేముల జగదీష్, దస్తరి ఉమామహేశ్వర్, రేణికుంట్ల బిక్షపతి, వార్డు సభ్యులు సుంచు చంద్రమౌళి, ముదిరాజ్ సంఘం డైరెక్టర్ సుంచు రాంబాబు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ వ్యవసాయ అధికారిగా కే. రాజుకు పురస్కారం.

## మండల రైతులు హర్షం

**బయ్యారం/జనవరి 27 (జర్నలిస్ట్ వార్త):**
77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ చేతుల మీదుగా బయ్యారం మండల వ్యవసాయ శాఖ అధికారి కే.రాజు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మండల రైతులు మంగళవారం వారి సేవలను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ గుర్తించి అవార్డు ఇచ్చినందుకు మండలంలోని పలువురు రైతులు,ఆదర్శ రైతులు ఏఓకు, కృతజ్ఞతలు



అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యసాయనికి కావాల్సిన యూరియ పంపిణిలో రాష్టంలో తొలిసారిగా ఎరువుల పంపిణి కార్డు ప్రవేశపెట్టి స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా నవంబర్ ఆవిష్కరించి తద్వారా మండలం మారుమూల గ్రామాలకు రబీ సాగు రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మండల వ్యాప్తంగా పలు విడతలలో 29 గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు, 50 వేల యూరియ బస్తాలు పంపిణి చెయ్యడం జరిగిందన్నారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందించి వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండటం వల్ల ప్రభుత్వం గుర్తించి పురస్కార పత్రాన్ని అందించిడం ఎంతో అభినందనీయమని అన్నారు..జిల్లా కలెక్టర్ చేతుల మీద పురస్కార పత్రం అందుకోవడం ఇది రెండవ సారి అని వారు తెలిపారు..మండలంలోని రైతులకు మరింత సేవలు అందించేందుకు ఏఓ కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అన్నపూర్ణ కుమారుడి అంత్యక్రియల్లో పాడే మోసిన కొత్తపేట సర్పంచ్.



**,బయ్యారం/ జనవరి 27,(జర్నలిస్ట్ వార్త);** మండలంలో కొత్తపేట గ్రామపంచాయతికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు గుర్రం అన్నపూర్ణ కుమారుడు కళ్యాణ్ కాలేయ సంబంధిత వ్యాధి రావడంతో హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. వారం రోజుల చికిత్స తీసుకుంటుండగా పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందారు. మృతదేహాన్ని కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ మంగళవారం సందర్శించి, మృతదేహనికి పూలమాల వేసి నివాళి అర్పించి అన్నపూర్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ ప్రవీణ్ నాయక్ మృతుడు కళ్యాణ్ పాడెను మోసి కడసారి వీడ్కోలు పలికారు. ఒక్కగానొక కొడుకు మరణించడంతో అన్నపూర్ణ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు, గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

# నర్సంపేట మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన పార్టీ

## ప్రజలతో మమేకంగా ఉండాలన్నదే లక్ష్యం: ఆర్కే సాగర్

## నర్సంపేటలో జనసేన జెండా ఎగరడం ఖాయం -నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెరుగు శివకోటి యాదవ్

**నర్సంపేట / జనవరి 27 (జర్నలిస్ట్ వార్త):**
రాబోయే నర్సంపేట మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతూ ప్రజల మధ్య మరింత బలంగా నిలబడుతుందని జనసేన నేతలు ధీమా వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు నర్సంపేట పట్టణంలో నిర్వహించిన జనసేన పార్టీ ముఖ్య కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి.

ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.కే. సాగర్, వరంగల్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మాదిరెడ్డి దామోదర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, అనంతరం వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం నిర్వహించిన బైక్ ర్యాలీ నర్సంపేట పట్టణాన్ని ఉత్సాహంతో నింపింది. జనసేన జెండాలతో పట్టణ వీధుల్లో సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో విశేష స్పందనను రేకెత్తించింది. వడ్డే ఓబన్న విగ్రహం వద్ద మాట్లాడిన నర్సంపేట నియోజకవర్గ నాయకులు ఓర్సు రాజేందర్, వడ్డే ఓబన్న ఆశయాలు జనసేన పార్టీ సిద్ధాంతాల్లో



ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

ద్వారక కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెరుగు శివకోటి యాదవ్ మాట్లాడుతూ, నర్సంపేటలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి జనసైనికుడు ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నర్సంపేటలో జనసేన జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.కే. సాగర్, జనసేన పార్టీ



ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితమైన పార్టీ అని తెలిపారు. ప్రజలతో మమేకంగా పనిచేసే కార్యకర్తలే పార్టీకి బలమని, ఐక్యతతో పనిచేస్తే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో జనసేన విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డా. గోళ్ళ రాజేంద్ర ప్రసాద్, విజయ్ కుమార్, నియోజకవర్గ నాయకులు శ్రీ బొబ్బు పృథ్వీ, ఓర్సు రాజేందర్, గంగుల రంజిత్, సుదగాని ప్రదీప్ పాల్గొన్నారు. జనసైనికులు, వీర మహిళలు, యువత భారీ సంఖ్యలో హాజరై జనసేనపై తమ నమ్మకాన్ని చాటారు.

# పడిపోతున్న డాలర్.. నిలకడగా రూపాయి

అమరావతి, **జనవరి 27,(జర్నలిస్ట్ వార్త);**పపంచ కరెన్సీ మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రధాన కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ బలహీనపడుతుండగా, భారత రూపాయి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. డాలర్ బలహీనత కారణంగా భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా డాలర్ విలువ పడిపోతోందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు రూ. 90 వద్ద నిలకడగా ఉందని, స్వల్పకాలంలో ఇదే స్థాయిలో కన్సాలిడేట్ కావొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపింది. భారత్ నికర దిగుమతిదారుగా ఉండటం రూపాయిపై భారం మోపుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడటం మద్దతుగా నిలుస్తుందని వివరించింది. గత 18 నెలలుగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థలు నికర అమ్మకందారులుగా ఉన్నాయి.